
# కాలే కడుపుకు గంపెడు మల్లెలు



'ఇద్దరిని కాదని మూడోచెవిని పడిన మాట రహస్యమేకాదు!' అని అనుభవానికి తెచ్చుకొని విధిగా పాటిస్తూ అవసరమైతే ఉచిత సలహాలు కూడా గుప్పిస్తూ పేకమేడల నీడల్లో పోకకు పొందని మాటల్తో ప్రతిభామూర్తిగా చలామణీ అవుతున్న మూర్తి ఆమాట తన చెవుల్లో వేస్తాడని అతడు కలలో కూడా ఊహించలేదు.

మూర్తి అతడి స్నేహితుడే కావచ్చు. స్నేహితుల మధ్య నిజం చెప్పాలంటే రహస్యం బద్ధశత్రువే. కాదనలేం. కానీ మూర్తికి ఆమెకు మాత్రం సంబంధించింది ఆ మాట!

మరి ఆమాట? మూర్తిని ఆమెను కాదని మూడోచెవిని పడడమంటే అది రహస్యం కాదు. అయితే అది రహస్యమే!...రహస్యాన్ని ఏ పరిస్థితుల్లోనూ మూడోచెవిలో వేయడం మూర్తి పద్ధతి కానేకాదు. మరి పనిగట్టుకొని అతన్ని వెదకి పట్టుకొని ఆ మాట అతనితో ఎందుకన్నట్టు?

అదే అతన్ని వదలకుండా పట్టుకొని పీడిస్తున్న ప్రశ్న.

ఆ ముందురోజు అలసిసొలసిన సూర్యుడు పడమటి కొండల మీద నిలబడి అలుపు తీర్చుకొంటున్నాడు. ఆ కొండలు వెల్లకిల పడుకొని మోకాళ్ళను మాత్రం కాస్త పైకెత్తి పెట్టుకొన్న నగ్న సుందరిని తలపింపచేస్తున్నాయి. ఆసుందరి అందచందాలను ఇంకా ఇనుమడింప చేయడానికి మోకాళ్ళ మీద వెలిగించిన ఫోకస్‌లైట్‌లా సూర్యుడు. ఆ సమయంలో ఒకసారి. కర్మసాక్షిగా తనకది తగదనుకొన్నాడేమో సూర్యుడు ఆమె మోకాళ్ళమాటున తలదాచుకొన్నాడు. అపుడు మరొకసారి. మూర్తి అతని ఇంటికి రెండుసార్లు వెళ్ళాడు. అతన్ని పట్టుకొన్నాడు. వెంట పెట్టుకొన్నాడు. తన గదికి తీసుకొని వెళ్ళాడు! వద్దు మిత్రో! అని మొత్తుకొంటున్నా వదలకుండా మందుగ్లాసు ముందు కూర్చోబెట్టాడు. నవ్వనని భీష్మించి కూర్చున్న వాడిని నవ్వించడం... కాదు అంటే అవునని పించడం 'ఇవ్వను!' అన్నవాడి దగ్గరే ఇప్పించుకోవడం మూర్తి ప్రత్యేకత.

ఆ ప్రత్యేకత ముందు అతడు తలవంచక తప్పలేదు.

మూడో పెగ్గులో మనస్సు అలా అలా దూది పింజలా తేలిపోతూ ఉంటే అప్పుడు ఆదూది పింజకు నిప్పు పెట్టినట్టు ఆ మాట అతనితో అన్నాడు.

మనిషి కొన్ని సత్యాలను బయట పెట్టడమో భరించడమో ఒకరి ఆధీనంలో స్వాధీనం తప్పినపుడే జరుగుతుంది. మందు మత్తులో స్వాధీనం తప్పి ఉన్నాను. అయినా ఆ మాటతో మందు పనిచేయడం మానేసింది.

మందు మత్తునుండి బయటపడిన మనసు తర్కవితర్కంలో పడింది.

"మూర్తి ఆ మాటనాతో అనవలసిన మాటేకాదు. అయినా అన్నాడు. ఎందుకన్నాడు? బాధ పెట్టాలనా? అది అతని తత్త్వంకాదే? పోనీ. ఒక మనిషిని బాధ పెట్టాలంటే ఎన్ని మార్గాలు లేవు? అనరాని వినరాని మాటే అనాలా? మాటల్లో మాటగా జారిందనడానికి కూడా ఆస్కారం లేదే? మరి ఎందుకన్నట్టు?" అని.

ఎంత జుట్టు పీక్కొన్నా సమాధానం దొరకలేదు.

ఎంత ప్రయత్నించినా కంటిమీద రెప్పపడలేదు!

తెల్లారింది.

అతడికి కూడా తెల్లారింది. తెల్లారితే ఒక్కొక్క బతుక్కు ఒక్కొక్క సమస్య. ఆ సమస్య తీవ్రతనుబట్టి ఉంటాయి ఆరాట పోరాటాలు. అలాంటి సమస్యలు లేకపోయినా అతడు ఆరాటపడుతున్నాడు. ఆవేదన పడుతున్నాడు. ఆ మాటతో అతని నవనాడులను తెంపి ముడేసి బిగిస్తున్నట్టుగా బాధ. ఆ బాధతో అతడు ఆరోజంతా ఇంటిని మరిచాడు. ఇంట్లో ఇల్లాలుందనీ... పిల్లలున్నారని... వాళ్ళ కనీస అవసరాలు తీర్చవలసిన బాధ్యత తనదని మరిచాడు. కొందరికి ఇచ్చిన మాట మరిచాడు. కానీ ఆమాట మాత్రం మరిచిపోలేక పోతున్నాడు.

మూర్తి చెప్పిన మాట అతని మీద మంత్రంలా పనిచేసింది. శరీరాన్ని దెయ్యమై ఆవహించింది. ఆ ఆవాహనలో అతడు దెబ్బతిన్నపాము. పదవిని పోగొట్టుకొన్న మంత్రి.

దెబ్బతిన్న పాము ఆవేశం... పదవిని పోగొట్టుకున్న మంత్రి ఆవేదన... ఈ ఆవేశావేదనల మధ్య నలుగుతూ... తనలోకంలో తాను భ్రమిస్తూ... అక్కడక్కడ నిలబడి నిట్టూరుస్తూ... గొణుగుతూ... ఆమాటకు అర్థం వెదుకుతున్నట్లుగా ఎటోచూస్తూ!

ఎవరైనా అతన్ని జాగ్రత్తగా గమనిస్తే 'అయ్యో పాపం! పిచ్చోడు' అంటారు. చూపుకు అతడొక పిచ్చోడిలా కనిపించినా అతని అంతర్మథన ఏ అడ్డంకులు లేకుండా సాగిపోతూనే ఉంది. అది ఆమె గతంవైపు మళ్ళింది.

"అవును. ఇప్పుడు నేను ఆమె గతాన్ని తవ్వుతాను. దానివల్ల ప్రయోజనం లేకపోవచ్చు. పదిమంది దృష్టికి అది ఎబ్బెట్టుగా తోచవచ్చు. గతంలో గడించిన అనుభవాలతో భవిష్యత్తును ఆదర్శ ప్రాయంగా మలుచుకోలేనపుడు ఆ వ్యక్తి కంటే పశువే మేలు!' అని.

అందుకే ఆమె మూర్తితో అంతమాట అనగలిగింది.

ప్రతి మనిషి జీవితంలో గతం ఉన్నట్లే తోచవచ్చు. వ్యక్తిగతం లేని మనిషి అన్న అపవాదుకు కూడా లోనుచేయవచ్చు. గట్టున నిలబడిన వాళ్ళకు బావిలోతు ఎలా తెలుస్తుంది? బావిలోతే తెలియదంటే గుండెలోతు తెలుస్తుందా? అందుకే అవి వాగుతాయి. అలాంటి వాళ్ళకు నా సమాధానం ఏమంటే? ఏవ్యక్తికి అయినా వర్తమానం ఉంటుంది. భవిష్యత్తు ఉంటుంది. భవిష్యత్తును విశ్లేషించడానికి ఎన్నో శాస్త్రాలున్నాయి. ఆ శాస్త్రాల ఆధారంతో ఎంతో మంది బతికిపోతున్నారు. వాళ్ళు చెప్పేది జరుగుతుందో లేదో చెప్పేవాళ్ళు చెప్తున్నారు. వినేవాళ్ళు వింటున్నారు. జరగవలసింది జరిగిపోతూనే ఉంది. కానీ గతం వర్తమానం అలా కానేకాదు. గతం మన అనుభవానికి వచ్చింది. వర్తమానం మనం అనుభవిస్తున్నది.

హూఁ! ఆపూట కూటికి ఎలా అన్నది ఆమె గతం.

సంపాదించిన లక్షలాది డబ్బును ఎలా దాచుకోవాలన్నది ఆమె వర్తమానం!

ఆమె గతానికి వర్తమానానికి తరాలు మారలేదు. కనీసం దశాబ్దాలు గడిచి పోలేదు. కేవలం ఒకే ఒక్క దశాబ్దకాలానికి కూడా లోపే. ఈ స్వల్పవ్యవధిలో ఊహించలేని మార్పుకు కారణం ఆమె అదృష్టమే అంటారు లోకులు. అదృష్టమూకాదు. గాడిదగుడ్డూకాదు. బతక నేర్వడానికి మారుపేరే అదృష్టం!

ఆమె బ్రహ్మాండంగా బతకనేర్చిన మనిషి.

ఏ మనిషికైనా బతక నేర్వాలంటే ఆ మనిషిలో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి. ఆ ప్రత్యేకతను పెట్టుబడిగా పెట్టుకుంటారు. ఎదుటి వ్యక్తి బలహీనతపై వ్యాపారం చేస్తారు. చూస్తూ చూస్తూ ఉండగానే ఊహించలేనంత ఎత్తుకు ఎదిగిపోతారు. అప్పుడు లోకం గుడ్డిగా వాళ్ళ ఉన్నతికి అదృష్టాన్ని మాత్రమే ముడిపెట్టి మాట్లాడుతుంది.

"అయ్యా! అయ్యా! పురిట్లో బిడ్డె. పాలు సాల్లేదయ్యా. పావలా దుడ్లు దరమం చెయ్యండయ్యా. మీకు పున్నెముంటుంది. మీ బిడ్డా పాపా సల్లంగుంటారు."

ఆ మాట చెవిని పడడంతో అతని ఆలోచన స్రవంతి తెగిపోయింది. తన లోకంలో నుండి మళ్ళీ ఈ లోకంలో పడ్డాడు. నిలబడ్డాడు ఆమె ఎదురుగా...

లోకంలోని దీనాన్నంతా గుంతలు పడిన కండ్లల్లో నింపుకొని...మొగం నిండుకు అమాయకతను పులుముకొని...కుడిచేతిని ముందుకు చాపి...ఎడమచేతి ఆధారంగా పైట ఉయ్యాల్లో పసిగుడ్డును పెట్టుకొని. పచ్చివాళ్ళు. పురిటి వాసన. 'కేర్ కేర్' మంటూ పసిగుడ్డు గుక్కపెట్టి ఏడుపు!–

రెప్పార్చకుండా అతడా బిచ్చగత్తెను చూస్తున్నాడు. చూస్తూ చూస్తూ ఉండగానే ఆ రూపం కరిగిపోయింది. ఆ తావులో ఆమె!–

"అవును గదా? అచ్చం బిచ్చగత్తెలాగే ఒకనాడు లోకం ముందు నిలబడింది. ఆమె కూడా ఇలాగే చేతులు చాపింది. ఇద్దరూ లోకం ముందు నిలబడి చేతులు చాపడం బిడ్డల భవిష్యత్తు కొరకే. అయితే ఒక్కటే తేడా. ఈమె వీధుల మీద పడింది. ఆమె తన చుట్టూ మనుషులను తిప్పుకోగలిగింది. బెల్లం చుట్టూ ఈగలు ముసరడం సహజమే కదా?'

అని ఆలోచిస్తూ అతడు ఆ బిచ్చగత్తెను తదేకంగా చూస్తున్నాడు.

ఆ చూపును పాపం! అపార్థం చేసుకొందేమో ఆ పిచ్చి తల్లి. ఆదొక మాదిరిగా అతనిని చూసింది. మూతి మూడు వంకర్లు తిప్పింది. 'ఛీపో!' అన్నట్లుగా చేతిని గాలిలో విసిరికొడుతూ ఆమె విసవిస వెళ్ళిపోయింది.

"అవునవును. ఆమె కూడా ఇలానే వెళ్ళిపోయింది. అయితే ఒక్కటే తేడా. ఆమె అవసరం తీర్చుకొని వెళ్ళిపోయింది. ఈమె తీరకనే వెళ్ళిపోయింది."

ఆ మాట మనస్సులో మెదిలేసరికి అతడికి నవ్వు వచ్చింది. పదిమంది వస్తూ పోతున్న దారి అని కూడా గమనించకుండా అతడు పడిపడి నవ్వాడు. నవ్వుతూ నవ్వుతూ మళ్ళీ తన లోకంలోకి వెళ్ళిపోయాడు. ఆ లోకంలో అతడు. ఆమె. ఇద్దరే! అతనిని వదిలి ఆమె బతకలేనంటూ. ఆమె చుట్టూ తిరుగుతూ అతని ఆలోచనలు.

"అంతేగదా? అవసరం తీరే వరకే గదా ఎవరైనా?– మరీ చేసిన త్యాగాలకు... సహాయాలకు జీవితాంతం ఋణపడి ఉండడం అనాగరికమని భావించే ఈ నాగరికలోకంలో పైకి వెళ్ళడానికి అవసరమయిందని నిచ్చెనను భుజాన వేసుకుని తిరగడానికి ఎవడికైనా పిచ్చా? వెర్రా?

ఆమె మాత్రం ఏంచేస్తుంది?

ఈ దేశ జనాభాలో నలుగురు చేరడానికి సహకరించిన భర్తా? గతించాడు. బండ్లు ఓడలు కావాలని ఆయన చేసిన నిర్వాకమా? బండ్లకెత్తగలిగినంత అప్పును ఆస్తిగా మిగిల్చింది. మా నూరేండ్ల జీవితం మాటేమిటని నలుగురు కసుగందులు ఎదుట నిలబడి ఉన్నారు. ఈ పరిస్థితుల నుండి బయట పడాలంటే ఏమి చెయ్యాలని ఆమె రాత్రింబవళ్ళు ఆలోచించింది. అప్పుడు

కొందరు మనుషులు ఆమె కండ్లల్లో మెదిలారు. వాళ్ళ చేతులకు మట్టి తగలడం లేదు. కట్టిన గుడ్డ నలగడం లేదు. ఎక్కిన కార్లు దిగడం లేదు. వాళ్ళు అనుసరిస్తున్నది పూలూ దారం న్యాయం. నాగరికుడైన మానవుడు సాధించిన ఇదొక అద్భుత న్యాయం. పూలూ దారం కట్టితే మాల. ఆ మాలలో దాగిన దారంలా స్వార్థం!

ఆ మాల వెదజల్లుతున్న అందాలు పరిమళాలు ప్రజాహిత కార్యక్రమాలు!

ఈ న్యాయానికి మించిన న్యాయం మరొకటి మరొకటి లేదనుకొనింది!!--

అడుగు బడుగు వర్గాల బాలబాలికల వసతి గృహం ఆమె కండ్ల ముందు మెదిలింది. ప్రభుత్వం నుండి గుర్తింపు పొందేవరకే అది బాధకానీ... బాధ్యత కానీ. ఆ తర్వాత తన బరువు బాధ్యతలను అదే మోస్తుంది. అంతే! చేతిలో సంచీ.. ఆ సంచీలో కరపత్రాలు... రసీదుపుస్తకాలు సహజసిద్ధంగా తనకు సంక్రమించిన ప్రత్యేకతకు మరింత ప్రత్యేకతను సమకూర్చుకొని ఆమె లోకంమీద పడింది.

ఆమె ఏదో ఒక విధంగా వీధుల్లో పడడమే తమకు కావలసినదని ఎదురు చూస్తున్న కొందరు మనుషులు ముసిముసిగా నవ్వుకొన్నారు. నువ్వుముందా? నేను ముందా? అంటూ ఎగబడ్డారు. ఆమె తల పెట్టిన ప్రయత్నం అద్భుతమని కొనియాడారు. ఎంతో ఉదారంగా ముందుకొచ్చినట్లు నటించారు. హామీలు కుమ్మరించారు. ఆమె నమ్మింది. మానవుడి జీవితగమనాన్ని సుఖప్రదం చేయగలశక్తి నమ్మకానికి ఎవరిచ్చారో ఏమో తెలియదుకానీ నమ్మకం అపనమ్మకాల మధ్య గీచిన అదృశ్యరేఖను తుడిపేస్తే ఎదురయ్యే పరిస్థితిని ఊహించడమూ కష్టమే. విశ్లేషించడమూ కష్టమే! అందుకే ఆమె ఒక్క అడుగు ముందుకు వేసింది. దీపం చుట్టూ చేరే పురుగులు దీపానికి బలిఅవుతాయి. కానీ ఆమె మగపురుగులకు బలి అయింది.

అడుగుబడుగు వర్గాల బాలబాలికల వసతి గృహానికి వసతి లేకుండా పోయింది.

అయ్యోపాపం! ఏ స్త్రీకి అటువంటి పరిస్థితి రాకూడదు.

"ఏంవయ్యో! ఇది పదిమందీ వస్తాపోతా ఉండే బాట. కార్లు లారీలు మోటార్లు ఒకదానిమిందొకటి పోటీపడ్తా ఉండాయే? కనపళ్ళేదా? ఈడనిలబడకోని నీ లోకంలో నువ్వుంటే నీకు నూకలు చెల్లిపోతాయి."

ఎవడో రిక్షావాడు. దూసుకొని ముందుకు పోతున్నాడు. ఎదురుగా వస్తున్న ఆటోను తొలగడానికి ఒక్క ఊపులో పక్కకు తొలిగి... అతడి మీద పడినంతపనై... పక్కకు తప్పుకొని నిలబడి హెచ్చరించి... తలవొక విసురు విసిరి... ఆ విసుగునంతా కాళ్ళల్లోకి చొప్పించి... కదలని రిక్షాతో తలపడు తున్నాడు.

ఆ రిక్షావాడి మాటతో ఈ లోకంలో పడ్డాడు. అటుయిటూ చూశాడు. నలుగురు తననే చూస్తున్నట్లుగా సిగ్గుపడ్డాడు. తలవంచుకొన్నాడు. గబగబ ముందుకు నడుస్తున్నాడు. నడుస్తూ నడుస్తూ ఈలోకాన్నే మరిచి పోయాడు.

"ఒకడు ఎంత ప్రజ్ఞావంతుడైనా కావచ్చు. అనుభవజ్ఞుడూకావచ్చు. పది మందికి చెప్పడమేకానీ చెప్పించుకోవడం లేకపోవచ్చు. అయితే వాడుగూడా ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక సందర్భంలో ఒకడి చేత చెప్పించుకోక తప్పదేమో? రిక్షావాడు చెప్పింది అదేకదా?

అవును. ఇప్పుడు రిక్షావాడు. అప్పుడు ఆమె!

"ఏమండీ! మీరు పేరు ప్రఖ్యాతులున్న రచయితలుకదా? పైగా హీనులు దీనులు దళితులు పతితల పక్షాన నిలబడి సాహితీ పోరాటం సాగిస్తున్న సహృదయులు కదా? మీ రాతలు రాతల వరకేనా? లేక వాళ్ళ తల రాతలు మార్చే చేతలు కూడానా?" అని నిలదీసింది.

ఆమె ఆమాట అడగడంలో ఔచిత్యం ఉంది.

నిలబడి ఆలోచించవలసిన అవసరమూ కలిగింది. ఆలోచిస్తూ చుట్టూ జరుగుతున్న తంతును గమనిస్తే-

అట్ట నలగకుండా పుస్తకం అందం చెడకుండా (మళ్ళీ అమ్మి సొమ్ము చేసుకోవాలి కదా?) సిద్ధాంతాలు వల్లెవేయడం...వేదికల మీద నిలబడి ధారాపాతంగా కుమ్మరించడం... చప్పట్ల మధ్య దోపిడీ వ్యవస్థను దుమ్మెత్తిపోయడం... ఏ.సీ. కార్లల్లో సినిమా సెట్టింగుల్లాంటి తమ భవనాలముందు దిగడం... గ్లాసులముందు కూర్చొని అలుపు తీర్చుకోవడం!

ఈ కర్మభూమిలో ఎవడో ఒక పనికిమాలినవాడు ధార్మిక చింతనతో ముందు పడ్తే సిద్ధాంతం తెలియని ఆచరణ గుడ్డిదని ఎత్తిపొడవడం...దానిని మరొకడు ఆచరణకు రాని సిద్ధాంతం గొడ్డుదని వాదించడం!...

కవులు రచయితలు కళాకారులు ఎవరైనా కానీయండి. కర్తవ్యనిర్వహణ సమయాల్లోనే వాళ్ళు కవులు...రచయితలు...కళాకారులు! ఆ తర్వాత వాళ్ళూ మనుషులేకదా? అని అందమైన లాజిక్కు దుప్పట్ల చాటున తమ బలహీనతలను కప్పిపుచ్చుకోవడం!...

సమస్యలను విశ్లేషించి చూపడం వరకే మా బాధ్యత. పరిష్కారం మాదికాదు. చైతన్య వంతులైన ప్రజలు పరిష్కారమార్గాన్ని తమకు తామే ఎన్నుకుంటారు అంటూ రచయితలు తాడితపీడత జనుల బతుకులనే ముడిసరుకుగా వాడుకోవడం!...

అవును. స్వార్థం చాపకింద నీళ్ళులాగా వ్యాపించి ఇష్టారాజ్యం ఏలుతూ ఉంది. అందరూ లోకాన్ని ఉద్ధరించడమే తమ ధ్యేయంగా మాట్లాడుతున్నారు. చేతల వరకు వస్తే మాత్రం ఎవడి స్వార్థం వాడిది. అంతేకాని పొరుగువాడికి తోడ్పడం లేదని స్పష్టంగా కనపడుతూ ఉంది.

తన కథలో తాను సృష్టించిన ఒక పాత్ర అమాంతంగా ప్రాణం పోసుకొని 'ఈ పరిస్థితులకు కారణం చెప్పు?' అని నిలదీసింది. సమాధానం చెప్పడమేకాదు!- ఆ పాత్రతోనే ఒక ప్రయోగం. రాతను చేతగా మార్చే వజ్రసంకల్పం.

అది సంకల్పబలమో? ప్రయత్నఫలితమో? మట్టిని ముట్టుకుంటే బంగారమయినట్లు!... ఒక గారడీవాడు మామిడి చెట్టును మనకండ్ల ముందరే నాటి పెంచి పెద్దచేసి పండును కోసి చేతికిచ్చినట్లుగా చూస్తూచూస్తూ ఉండగానే ఆమె ఒక ప్రజాప్రతినిధి స్థాయికి ఎదిగిపోయింది!...

ఆ పదవి గౌరవప్రద మయింది. అంతకంటే బాధ్యతాయుత మయింది.

అప్పుడు ఆమె ఇంటిముందు వెన్నెముకకు అతుక్కుపోయిన కడుపులు...చర్మం తొడుగ్గా అస్థిపంజరాలు...బాగా వంగికుంగిన ఆకారాలేకాదు_మోకాళ్ళ కిందికి ఖద్దరు జుబ్బాలు... మెలితిరిగిన మీసాలు...బాన కడుపులు...వాళ్ళను మోసుకొచ్చిన కార్లు....స్కూటర్లు!... ప్రతినిత్యం ఆమె ఇంటిముందు ఆమె దర్శనం కోసం పడిగాపులు.

నిజంగా అదొక అందమైన సందడి!

"పడింది ఎవడిచేతిలో? రాయి శిల్పి చేతిలో పడినట్టు ఒక మంచి రచయిత చేతుల్లో కదా పడింది. జీవితం తెలిసిన ఆ రచయిత ఒక అద్భుతమైన జీవితాన్ని సమకూర్చాడు. రొట్టె విరిగి నేతిలో పడడమంటే ఇదే!"

ఒకప్పుడు ఆ మొగానికి నిర్దయగా 'ముండ' బోర్డును వేలాడగట్టిన అపర ముండలే ఇప్పుడు తెగమెచ్చుకొంటున్నాయి.

ఒకప్పుడు లోకం తెగిడిందని అతడు కుంగిపోలేదు. ఇప్పుడు పొగిడిందని పొంగిపోలేదు. ఒక రచయితగా తాను ఎన్నోపాత్రలను సృష్టించాడు. అందులో ఒక పాత్ర 'రాతలవరకేనా? చేతలు కూడానా? అని నిలదీసింది. సరైన సమాధానం చెప్పగలిగానన్న తృప్తి అతనికి మిగిలింది.

అయితే ఆతృప్తి ఎంతో కాలం నిలవలేదు.

ఎదురుచూడని అధికారం సునాయాసంగా చేతికి రావడం. ఆ చేతినిండుకు అవసరాలు. అధికారం అదుపు తప్పింది. పేదసాద అన్న విచక్షణ కోల్పోయింది. అడ్డదిడ్డంగా గడ్డి కరవడానికి జొరపడింది.

"ఇది తప్పు!" అన్నాడతడు.

"అది తప్పో? ఒప్పో? చేసే వాళ్ళకు తెలుస్తుంది. నీకేం తెల్సు?"

"గతాన్ని మరుస్తున్నావ్?"

"కాదు భవిష్యత్తును గురించి ఆలోచిస్తున్నాను."

"ఆలోచించాల్సిందే. అయితే తప్పుడు దారుల్లో ఏర్పరచుకొన్న భవిష్యత్తు ఎప్పుడో ఒకప్పుడు పునాదుల్తో సహా కూలిపోతుంది.'

"తమనుండి ఇలాంటి సందేశాలు... సలహాలు వినడానికి లోకం ఎదురుచూస్తూ ఉంది. ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. అదీగాక అడగనప్పుడు చెప్పడం అవివేకం. తప్పొప్పు అన్నవి పూర్తిగా వ్యక్తిగతం. వ్యక్తిగత విషయాల్లో జోక్యం? చాలాతప్పు. తప్పు కోవడం మంచిది."

తాను సృష్టించిన పాత్ర అదుపు తప్పింది. అదుపు తప్పినప్పుడు పెదవి విప్పడం వృథా. అందుకే నోరుమూసుకొన్నాడు.'

అక్కడికీ ఆమె ధనదాహం తీరలేదు. తీరడానికి ఆమె తొక్కిన దారి? అమాయకులైన అమ్మాయిలను చేరదీసింది. ఆదరిస్తున్నట్లు నటించింది. ఉద్యోగాల ఎర చూపించింది. అధికారుల కామవాంఛలకు బలి చేసింది.

ఈ సంగతి తెలిసి అతని మనస్సు విలవిల్లాడింది.

"నువ్విలా చేయడానికి వీల్లేదు." అని అడ్డుపడ్డాడు.

"మర్యాదగా తప్పుకో!" అని ఆమె హెచ్చరించింది.

"నువ్విలా ఎందుకు చేయాల్సి వచ్చిందో చెప్పు."

"నన్ను హింసించిన ఈ సమాజంపై నా కసి తీర్చుకుంటున్నాను. ఇందులో ఒకరి జోక్యంతో నాకు పనిలేదు. అనవసరంగా జోక్యం కల్పించుకుంటే ఆ తర్వాత పశ్చాత్తాప పడవలసి వస్తుంది. పరిస్థితి అంతవరకు రాకమునుపే ఎవరిదారి వాళ్ళు చూసుకోవడం మంచిది."

తెగేవరకు లాగడం తెలివిలేని పని.

ఎవరి దారి వాళ్ళదయింది!

వీళ్ళ పోకడలను చాలా జాగ్రత్తగా గమనిస్తూ ఉందిగదా లోకం. ఆకళలో అది బాగా ఆరితేరింది కదా? అందుకే-

"పెద్దోళ్ళు ఎంతో అనుభవంతో అన్నమాట. క్షేత్రమెరిగి విత్తనం...పాత్ర మెరిగిదానం-అని. తగుదునంటూ అపాత్రదానం చేశాడు. అనుభవిస్తున్నాడు." మొగం వాచేటట్టు మనసు కందేటట్టు వాయించింది.

అతడు చేసింది నిజంగా ఒక ప్రయోగం. ఒక పాత్ర ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని చేసిన గొప్ప ప్రయోగం. ప్రయోగం సత్ఫలితాన్నే ఇచ్చింది. అయితే తాను మలిచిన పాత్రే తన మీద ఎదురుతిరిగింది. జీవితం కథ కావడమంటే ఇదే!-

అందుకే ఆమె జీవితం కథ అయింది. ఆ కథ మలుపులు తిరుగుతూ ఉంది. ఒక్కొక్క మలుపులో ఒక్కొక్కడు తారసపడడమో తప్పుకోవడమో తప్పదు. అందులో మూర్తి ఒకడయ్యాడంటే అది ఆశ్చర్యపడవలసిన సంగతి కానేకాదు. అంతకంటే ఆలోచించవలసిన విషయమూ కాదు.

అయితే ఆలోచించవలసింది మాత్రం ఆమె మూర్తితో అన్న ఆ ఒక్క మాటే!

అది సటపటమైన మాటకాదు. సరాసరి పదునైన బాకునే గుండెల్లోకి దించినంత మాట. ఆ దెబ్బతో మనసు స్వాధీనాన్ని కోల్పోయింది. తాడు విడిచిన బొంగరమే అయింది. తిరిగి తిరిగి బొంగరంకూడా ఒక దశలో పడిపోతుంది. అతడు కూడా ఆస్థితికే చేరుకొన్నాడు.

ఒకచోట కూలబడ్డాడు.

అది ఒక పార్కు! ఎవడో ఒక ధర్మాత్ముడు తన పేరు శాశ్వతం కావాలని దానమిచ్చిన స్థలంలో పార్కు. కాలంతో పందెం వేస్తూ పరుగులు తీస్తున్న నేటిమనిషి నిర్లక్ష్యానికి గురైన

పార్కు. గూడులేని తోడులేని తాడు విడిచిన బొంగరాలకు తావరమయింది. ఆ పార్కులో ఒక బెంచీ. ఒకప్పుడు నాలుగ్గాళ్ళమీద. ఇప్పుడు మూడుకాళ్ళమీద ఆ పార్కులో పరిస్థితికి ప్రతీకగా. అతడు దానిమీద కూలబడ్డాడు. కూర్చోవడమే ఆలస్యం. అలసి సొలసిన శరీరానికి అది ఒక హంసతూలికా తల్పమే అయింది. అలానే ఆ బెంచీ మీద వాలిపోయాడు. కండ్లు మూతలు పడ్డాయి. చేతనా చేతనాల సంఘర్షణలో ఒక చిత్రమైనస్థితి. కలో నిద్రో తెలియని దశలో మనసు ఆ కట్టెనుండి వేరు పడింది. కాంతివేగాన్ని పుంజుకొనింది. రెప్పపాటులోనే గమ్యం! –

అది రెండంతస్తుల మేడ. అందమైన ఆ మేడ చుట్టూ కాంపౌండులో రకరకాల పూల మొక్కలు... వాకిట్లో చిరుతను మరిపిస్తూ ఒక కుక్క... అటుయిటు తిరుగుతూ దాని ఆర్భాటాలు. నౌకర్లు చాకర్ల హడావిడి. అన్నిటిని దాటింది. ఆమె పడకగదిలోకి తొంగిచూసింది.

వెండి వెలుగులు... ఖరీదైన సెంటు వాసనలు... గోడలకు అర్ధనగ్న చిత్రాలు... మనిషి మగసిరి రెచ్చగొట్టే వాతావరణం. ఆ వాతావరణంలో ఆమె. ఆమెకు ఎదురుగా కూర్చొని మూర్తి.

మీదే ఆలస్యం అని ఆహ్వానం పలుకుతున్నట్లుగా పట్టెమంచం!

"ఛీఛీ! వాడా? వాడొకరచయితా!'...హూఁ! ఒకస్వార్థుడు. అయినా వాడిమాట ఇప్పుడెందుకు? పడకంటే వాడికి తెలుసా? ఆ పడకమీదికి పిడికెడు మల్లెపూలు అవసరమన్న ఆలోచన వాడికుందా? వాడూ ఒకమొగోడేనా?... ఒక రసవత్తరఘట్టంలో అనవసరంగా ఆ అరసికుడి మాటతెచ్చి మూడ్ చెడగొడుతున్నావోయ్ మూర్తీ!'

ఆమాటతో కూడ మూర్తి పైకి లేచాడు. గబగబ ఇంటి బయటికి నడిచాడు. ఆ మేడ ముందు నిలబెట్టిన కారెక్కాడు. ఊరంతా తిరిగాడు. కనిపించిన చోటంతా కారు నిలిపి మల్లెపూలు కొన్నాడు. ఒక్క గంపెడు మల్లెపూలు తెచ్చి ఆ పడకమీద కుమ్మరించాడు. ఆమె గుమ్మయి పోయింది.

శోభనం గదిలో అడుగుపెడుతున్న కొత్త పెండ్లి కూతురిలా ఆమె ముసిముసిగా నవ్వుతూ పైకిలేచింది!...

మూర్తి అతడితో వాగిన ఆమాటే చేతనాచేతనాల చిత్రమైన స్థితిలో ఒక దృశ్యంగా కనులముందు మెదిలినట్టు మెదిలి మాయమయింది.

"ఛీఛీ!"

అతడు ఉలిక్కిపడ్డట్టు ఈ లోకంలో పడ్డాడు.

"బాబ్బాబూ! ఇది పడక గదికాదు. పడక గదిలో పట్టెమంచమూకాదు.

ఆ మంచం మీద వెదజల్లిన మల్లెపూలు అసలే లేవు. ఇదొక పార్కు. పార్కులో కుంటి బెంచీమీద కునికిపాట్లు పడుతూ నువ్వు."

మనసు హెచ్చరించింది.

అతని దృష్టి ఆ పార్కువైపు మళ్ళింది.

జనసంచారమేలేని పార్కు ఒక మూల చచ్చిపడివున్న ఎలుక. ఆ ఎలుకను పొడిచి పొడిచి తింటూ కాకులు. అది ఒక కుక్కకంట పడింది. ఆ కుక్క మొరుగుతూ అటువైపు పరుగెత్తుతూ ఉంది. ఆ అరుపుతో బెదిరి పైకెగిరిన కాకులు గోలగోల!'

అతని దృష్టి మరొక చోటికి మళ్ళింది.

అక్కడ. ఎండిన పచ్చితోలు కప్పుకొని చినిగిన నిక్కర్లతో బక్కచిక్కిన ఆకారాలు. ఏ హోటల్ విసిరేసిన ఎంగిలాకుల్లో మెతుకులో?... 'అమ్మా! ఆకలి!' అంటే ఎవరో ఒక తల్లి దయతలచి విదిలించిన మెతుకులో?... పాత గుడ్డలో పోసుకుని..ఆశగా ఆబగా భాగ పరిష్కారంలో చేతులు కలుపుకొని!

పక్కన్నే రోడ్డు. ఆరోడ్డు మీద కార్లు మోటార్లు శరవేగంతో అరుస్తూ... నీరెండలో మెరుస్తూ... అతి సర్వసాధారణంగా... కాలమగమనంలో భాగంగా... ఆలోచనల్లో భాగం కాలేకుండా!-

కండ్లు మూతలు పడ్డాయి. అంతవరకు కండ్లముందు మెదిలిన బాహ్యప్రపంచం గాలికి కొట్టుకొని ఎటుపోయిందో పోయింది. గుండె అట్టడుగు పొరల్లో బుట్టలో పాములా పడివున్న రచయిత అనుభవానికి వచ్చిన సంఘటనలో పండిన ఆ స్పందనలో ఆవేశము. ఆవేదన. కలగలుపుతో ఆలోచన!

"హుఁ! పడకమీదికి పిడికెడు మల్లెపూల అవసరాన్ని ఆలోచించలేని..."

ఆమె అంతమాట అనడానికి కారణం?'

"డబ్బు!"

"డబ్బా?"

"అవును. అది డబ్బు స్వభావం. ఆ డబ్బు పెరిగేకొద్దీ మనిషిలో కోరికలు సుఖాలవైపు పరుగులు తీస్తాయి."

"అది డబ్బులోనేపుట్టి డబ్బులోనే పెరిగిన వాళ్ళ స్వభావం కావచ్చు. మసిబారిన నల్లని మట్టికుండల అడుగులో నాలుగు తెల్లని మెతుకుల కోసరం..."

"తాపత్రయ పడినమాట వాస్తవమే. పసికందుల ఆకలి తీర్చడానికి మల్లెపూవుల్లాంటి నాలుగు తెల్లని మెతుకులకోసరం నీ తిప్పలు నీవు పడ్డావు. ఆ తిప్పల్లో పడకలు... మల్లెపూలు నీమతికి రాలేదు. గమ్యం చేరుకోవడమే లక్ష్యంగా శ్రమించావు. అది నీ సంస్కారం."

"అదే గుర్తుంటే? ఆమె తనలాంటి నాలుగు జీవితాలను చేరదీసి ఒక ఆదర్శమూర్తిగా నిలబడేది. అలాకాకుండా డబ్బే ప్రధానమనుకొని ఎప్పుడైతే అమాయకులైన అందమైన అమ్మాయిల జీవితాలతో చెలగాటాలాడిందో...తొక్కరాని అడ్డదార్లు తొక్కిందో... అప్పుడే డబ్బు ఆమెను తన స్వాధీనంలోకి తెచ్చుకొనింది. అవసరానికి మించిన డబ్బు తనకే కాదు సమాజానికి కూడా హాని చేస్తుంది.

"అయితే ఆ ఎత్తిపొడుపు?"

"అది డబ్బు మత్తు!"

"ఛీ ఛీ!"

ఆలోచన మాటగా నోటవెలువడింది.

అతని దృష్టి పార్కువైపు మళ్ళింది.

కుక్క చచ్చిన ఎలుకను నోట కరుచుకొని పరుగెత్తుతూ ఉంది.

కాకులు గోలగోల!

ఒకప్పుడు ఆ పార్కును సంరక్షించిన కాంపౌండు గోడ ఇప్పుడు మొండిగోడ. ఆ మొండిగోడ మీద నిలబడి ముంగాళ్ళను పైకెత్తి ఆ మొండిగోడ మీద మొండిగా నిలిచిన ఒక ఇనుపకమ్మి మీద పెట్టి... మెడను చాపగలిగినంత ముందుకుచాపి... ఒక మేక కొమ్మలో ఆకులను అందుకోవడానికి తాపత్రయం!...

బక్కచిక్కిన ఆకారాలు పంచుకొన్న ఎంగిలి మెతుకులను ఆవురావురుమని తింటూ!... అతని దృష్టి ఆ మెతుకుల మీద నుండి అటుయిటు కదలలేదు!

"ఈ మెతుకులేకదా జీవకోటికి ప్రాణాధారాలు. మనిషి ఏ పనిచేసినా కడకు చేయరాని పనులకు కూడా తెగించినా.. ఈ సిద్ధాంతాలు... రాద్ధాంతాలు.. .నినాదాలు... వాదాలు... వివాదాలు... ఒకదానిలో ఒకటి పోటీపడినా ఈ మెతుకులే గదా కారణాలు. ఈ మెతుకులు అందరికీ అందాలన్నదే కదా నీ ధ్యేయం. ఆ ధ్యేయసాధనే కదా నీ లక్ష్యం. ఒక వ్యక్తికి అందాలని కృషిచేశావు. అందాయి. అందినవాళ్ళను గురించి ఆలోచించడమెందుకు? ఈ నీ పవిత్ర దేశంలో ఆ నాలుగు మెతుకులకోసం అలమటించే అభాగ్యులు ఎంతమంది?

పైట ఉయ్యాల్లో పసిగుడ్డుతో పచ్చి బాలెంతరాలు!

అప్రయత్నంగా చేయి జేబు వద్దకు వెళ్ళింది.

ఆ చేతిమీద ఒక నులివెచ్చని కన్నీటి కణం కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ! ●

ఆహ్వానం
(1, మే 1997)